క్లుప్తంగా

అధికారుల బదిలీ

బంట్వారం: మండల పరిధి అధికారులు పలువురు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ రాజేందర్, ఆర్ఐ విజయ్‌భాస్కర్‌లు హైదరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. కోట్‌పల్లి మండల తహసీల్దార్ ఆశాజ్యోతి సంగారెడ్డి జిల్లా, ఆర్ఐ రమేష్ రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. బంట్వారం మండల పరిషత్ కార్యాలయంలో పని చేసే ఎంపీఓ విజయ్‌కుమార్ నవాబుపేట, సూపరింటెండెంట్ సుశీల్‌కుమార్ షిండే ధారూరుకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్ షఫీ మర్పల్లికి వెళ్లారు. వీరి స్థానంలో కొత్తగా అధికారులు రావాల్సి ఉంది. ఎంపీఓగా నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ రాధిక వికారాబాద్, యాలాల మండలం నుంచి మండలానికి వచ్చినప్పటికీ విధుల్లో చేరాల్సి ఉంది. బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లతో పాటు ఆర్ఐలు రిలీవ్ కావాల్సి ఉంది.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



సామగ్రితో విద్యార్థులు

దౌల్తాబాద్: మండల పరిధి కౌడీడ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, చెప్పులు, మ్యాట్లు తదితర వస్తువులు పంపిణీ చేశారు. ఇందులో ఉపాధ్యాయుడు రాజు, పంచాయతీ కార్యదర్శి లలిత, సంస్థ వెంకటయ్య, రాజేష్, పులీందర్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



టీచర్లను సన్మానించిన పాఠశాల సిబ్బంది

బంట్వారం: మండల పరిధి సల్బత్తాపూర్ జెడ్పీ హెచ్‌ఎస్‌లో పని చేసి బదిలీపై వెళ్తున్న, వచ్చిన ఉపాధ్యాయులు రవికుమార్, ప్రసాద్ తదితరులను ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది సోమవారం సన్మానించారు.

పాండురంగడి సన్నిధిలో గురుపౌర్ణమి



స్వామి వారి పల్లకీని మోస్తున్న భక్తులు

పెద్దేముల్: గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని పాండురంగా దేవాలయంలో పెరుగు బసంతం, స్వామి వారికి పల్లకీ సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులచే స్వామికి ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని పలు విధుల గుండా ఊరేగిస్తూ, కోట్ల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ భజన సంకీర్తనల మధ్య పల్లకీ సేవా చేశారు. ఉట్టి కొట్టి, భక్తులకు అన్నదానం చేశారు.

బోర్లను బాగు చేయించండి

ధారూరు: గ్రామంలో బోర్లు పాడై నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయించడం లేదని, కలెక్టర్ చొరవ తీసుకుని వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు సంబంధిత అధికారులకు సూచించాలని మోమిన్‌ఖుర్దు మాజీ సర్పంచ్ గౌస్ కోరారు. గంగారాం, చాకలి సంగమ్మ, ఈడ్గి రాములు ఇళ్ల సమీపంలో, పాఠశాల ఆవరణలో పాడైన బోర్లు ఉన్నాయన్నారు. దీంతో మరో గ్రామం నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. బోర్లకు మరమ్మతులు చేయించి నీటి సమస్యను తీర్చాలన్నారు.

పోచమ్మకు బోనాలు



రథంపై బోనంతో ఊరేగింపు

పరిగి: పోచమ్మ బోనాల పండుగ సోమవారం ఘనంగా జరిగింది. నెత్తిన బోనంతో భక్తులు పురవీధుల గుండా డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

అంకిత భావంతో.. పనిచేస్తే గుర్తింపు

మోమిన్‌పేట: అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి అన్నారు. సోమవారం తహసీల్ కార్యాలయ సబార్డినెట్ ఖాజాపాష బదిలీపై పూడూరు మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.

‘ప్రజావాణి’కి ఆదరణ కరువు

- దరఖాస్తుల కోసం ఎదురు చూసిన అధికారులు
- సద్వినియోగం చేసుకోవాలంటూ సూచన



మోమిన్‌పేట: ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ యాదగిరి



కుల్కచర్ల: ఫిర్యాదు చేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

బంట్వారం: ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువయింది. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. కోట్‌పల్లిలోనూ ఇదే పరిస్థితి. ప్రజల అర్జీల కోసం అధికారులు వేచి చూసినప్పటికీ.. ఎవ్వరూ రాలేదు. చేసేది లేక వారు తమ విధుల్లోకి వెళ్లిపోయారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన వేదికను సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా దరఖాస్తు చేసుకోవాలని, అర్జీల పరిశీలన అనంతరం పరిష్కరిస్తామని వెల్లడించారు.

చెత్త సేకరించడం లేదు

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో చేపట్టిన ప్రజావాణికి ఒకే ఒక దరఖాస్తు వచ్చిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి తెలిపారు. మండల పరిధి గోవిందాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పోచయ్య, సురేందర్‌లు గ్రామంలో వారం రోజులుగా చెత్త సేకరణ జరగడం లేదని ఫిర్యాదు చేశారు. ఇందులో పశువైద్యాధికారి గీత, ఏపీఓ శంకర్, లైన్‌మెన్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

తక్కువ బిల్లులు వస్తున్నాయి

కుల్కచర్ల: అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనులకు నిర్వాహకులకు సరిపడా బిల్లులు మంజూరు కావడం లేదని అడవివెంకటపూర్ గ్రామ సంఘం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు మద్దతుగా.. బీజేపీ జిల్లా గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ మాట్లాడారు. భహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలకు.. ప్రభుత్వం చెల్లిస్తున్న బిల్లులకు చాలా వ్యత్యాసం ఉందని, దీంతో నిర్వాహకులు నష్టపోతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు పనులను పరిశీలించి సరిపడా బిల్లులు వచ్చేలా చూడాలని కోరారు. విద్యుత్ సమస్యపై ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యల గురించి దరఖాస్తు చేసుకోవాలని కోవాలని, అర్జీల పరిశీలన అనంతరం వాటిని పరిష్కరిస్తామని వెల్లడించారు. పీఆర్ డీఈ చంద్రయ్య, తహసీల్దార్ మురళీధర్, చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు, ఎంపీఓ ఖరీం, పీఆర్ ఏఈ మణికుమార్ ఉన్నారు.

అధికారుల డుమ్మా



అధికారులు లేని ప్రజావాణి

దౌల్తాబాద్: ప్రజావాణి మొక్కుబడిగా సాగింది. మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం అధికారుల డుమ్మాతో వెలవెలబోయింది. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని, అనంతరం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్న లక్ష్యంతో చేపట్టిన వేదిక అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోంది. మూడు వారాలుగా ఇలాగే కొనసాగుతున్నా.. ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల ఇష్టా రాజ్యంగా మారిందని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. నిన్నటి ప్రజావాణికి విద్యుత్ ఏఈ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇలా వచ్చి అలా వెళ్లారు. ఎంపీడీఓ, ఉపాధి ఏపీఓ, ఐకేపీ ఏపీఎం ఉన్నారు. 16 శాఖలకు సంబంధించిన అధికారులు ప్రజావాణిలో పాల్గొనాల్సి ఉండగా.. కేవలం నలుగురు ఐదుగురు మాత్రమే హాజరయ్యారు.

రోడ్డుపై కాలువ.. పూడ్చివేత

తాండూరు: మున్సిపల్ పరిధి పాతకుంట ప్రాంతంలో రోడ్డుపై తవ్విన కాలువను మున్సిపల్ కమిషనర్ సమక్షంలో సోమవారం పూడ్చివేశారు. కాలువ భూమి కొంతకాలంగా వివాదంలో ఉంది. ఈ నేపథ్యంలో తాండూరుకు చెందిన వ్యక్తి తన భూమిలోనే రోడ్డు ఉందని పేర్కొంటూ రోడ్డుపై కాలువ తవ్వించాడు. దీంతో పరిసర ప్రాంత వాసుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఇదే విషయమై స్థానికులు కౌన్సిలర్ నీరజకు ఫిర్యాదు చేశారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. దీంతో ఆమె కమిషనర్ విక్రమ్ సింహారెడ్డితో మాట్లాడి, కాలువను పూడ్చి వేయించారు. ప్రజలు రాకపోకలు సాగించే రహదారులను ఎవరైనా ధ్వంసం చేస్తే సహించేదిలేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.



జేసీబీతో కాలువను పూడ్చి వేయిస్తున్న కమిషనర్

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

బంట్వారం: జూన్ 28 నాటికి కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఆగస్టు 5వ తేదీ లోగా బీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోట్‌పల్లి ఏఓ పాండురంగా చారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా గతంలో బీమా చేసుకున్న వారు ఏమైనా మార్పులు చేయాలనుకుంటే ఈ నెల 30 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు పట్టాదారు పాస్‌బుక్ లేదా ఎంఆర్‌ఓ డిజిటల్ సంతకంతో కూడిన డీఎస్ పేపర్ ఉండాలన్నారు. ఆధార్ కార్డుతో పాటు నామిని ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని వెల్లడించారు. అర్హులందరూ సంబంధిత ఏఈఓలకు గడువులోపు అర్జీ పెట్టుకోవాలని ఏఓ సూచించారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు ఉన్న వారు మాత్రమే బీమాకు అర్హులని వివరించారు. అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రజిత సూచించారు. 2024 జూన్ 28 తేదీ లోపు కొత్తగా పట్టా పాసు పుస్తకం పొందిన వారు మాత్రమే అర్హులని స్పష్టంచేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్ఐ బదిలీ**

తాండూరు రూరల్: ఆర్ఐ బాల్‌రాజు సోమవారం బదిలీపై వెళ్లారు. సాధారణ బదిలీలో భాగంగా ఆయన హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లినట్లు తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. రెండు రోజుల క్రితం ఆర్ఐ రాజిరెడ్డి రంగారెడ్డి జిల్లాకు, అటెండర్ లక్ష్మమ్మ యాలాల మండలానికి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. వీరి స్థానంలో కొత్తగా ఇద్దరు ఆర్ఐలు, ఒక అటెండర్ రావలసి ఉందని తహసీల్దార్ వెల్లడించారు.

◆ **కార్యాలయాల ఏర్పాటుకు భూ సర్వే**




కుల్కచర్ల: ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు పై అధికారుల ఆదేశాల ప్రకారం భూ సర్వే చేస్తున్నట్లు చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు తెలిపారు. చౌడాపూర్ మండలంలో ఎంపీడీఓ, తదితర కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సోమవారం సర్వేయర్ భాగ్యవతి, సీనియర్ అసిస్టెంట్ లింగయ్యల ఆధ్వర్యంలో సర్వే చేసి, తహసీల్దార్‌కు నివేదికను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, నాయకులు సలీం, మాసయ్య, యాదయ్య, గోపాల్ ఉన్నారు.

◆ **ఉద్యోగులకు బదిలీ సహజం**

కుల్కచర్ల: ప్రతి ఉద్యోగికి బదిలీ సహజమని ఎంఈఓ హబీబ్ అహ్మద్ అన్నారు. మండల పరిధి పోటిగడ్డతండా ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రాకేష్, శైలజలను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నతికి కృషిచేసిన టీచర్లను వారు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, అలాంటి వారు ఎక్కడికి వెళ్లినా.. గుర్తింపుతో పాటు గౌరవం దక్కుతుందన్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు దయాకర్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గీత, సీఆర్పీ రాజు ఉన్నారు.

◆ **ఆశల వేతనం పెంచండి**



అనంతగిరి: ఆశ వర్కర్లకు రూ.18వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆశ వర్కర్ల సమస్యల సాధనకై కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. 20 ఏళ్లుగా ఆశలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య భద్రతకు కృషి చేస్తున్నారని తెలిపారు. వారికి వేతనం పెంచడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. లేని యెడలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

◆ **చినుకు పడితే చిత్తడే**

నవాబుపేట: మండల పరిధి ఎల్లకొండ గేటు నుంచి పూలపల్లి గేటు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వరుస ముసురుకు గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తుంది. సుమారు 10 కిలో మీటర్ల మేర అధ్వానంగా మారి.. వాహనదారులకు చుక్కలు చూపెడుతోంది. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

◆ **బడికి సౌండ్ సిస్టం బహూకరణ**



యాలాల: మండల పరిధి రాస్నం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణయ్య, రాజేష్, మమతలు రూ.12వేల సౌండ్ సిస్టంను బడికి బహూకరించారు. ఇందులో హెచ్ఎం నరహరిరెడ్డికి, ఏఏసీ చైర్మన్ అంజమ్మ తదితరులు ఉన్నారు.

◆ **కురువలను ఎస్సీలుగా గుర్తించండి**

తాండూరు టౌన్: కురువలను ఎస్సీలుగా గుర్తించి, సర్టిఫికెట్లు ఇవ్వాలని కురువ సంఘం తాండూరు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కురువలుగా పిలవబడే మదాసి కురువ, మదారి కురువలమైన మాకు ఎస్సీ కుల (క్రమ సంఖ్య 30) సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉందనన్నారు. కానీ కురుమ, కురుబలుగా గుర్తించి బీసీ కుల (నంబర్ 11) ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఎస్సీలుగా గుర్తించాల్సింది పోయి.. బీసీలుగా గుర్తించి ప్రభుత్వం తమను అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా వెనుకబడిన కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. ఇందులో సంఘం గౌరవ అధ్యక్షుడు, అడ్వకేట్ గోపాల్, అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి మల్లేశం, ఉపాధ్యక్షులు పాండు ఉన్నారు.

◆ **రుణమాఫీపై ఆరా**



అనంతగిరి: రుణమాఫీ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ రైతులతో మాట్లాడారు. మున్సిపల్ పరిధి అనంతగిరిపల్లిలో ఎంత మాఫీ అయింది, ఏ బ్యాంకు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాఫీ అయిన వారు తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ధరణి ఈసీ, పహాణి వన్‌బి, ఆధార్, పట్టా పాసు పుస్తకం, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, రెండు పాసుపోర్టు సైజు ఫొటోలతో బ్యాంకుకు వెళ్లి రెన్యువల్ చేసుకోవాలని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇందులో ఏఈఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాగసముందర్ ఎస్‌బీఐలో రుణమాఫీ కోసం ఆరా తీస్తున్న అన్నదాతలు

కొత్త రుణాల కోసం క్యూ



పీఏసీఎస్‌లో రుణం కోసం వచ్చిన రైతులు

ధారూరు: ప్రభుత్వం రుణమాఫీ చేసిన నేపథ్యంలో.. కొత్త రుణం కోసం రైతులు బ్యాంకులకు క్యూకట్టారు. బ్యాంకులు, సొసైటీల ఖాతాల్లో ఆ డబ్బులు జమ కాగా.. ఇంతకు ముందు తీసుకున్న రుణాలకు జమకట్టి, తిరిగి కొత్తగా రుణం పొందేందుకు బారులు తీరారు. సోమవారం మండల పరిధి నాగసమందర్, ధారూరు ఎస్‌బీఐ బ్యాంకుల్లో, ధారూరు, హరిదాస్‌పల్లి సొసైటీలకు వందల సంఖ్యలో అన్నదాతలు చేరుకున్నారు. కొత్తగా ఎంత రుణం ఇస్తారని అడుగుతూ.. గతంకంటే ఎక్కువగా ఇవ్వాలని అభ్యర్థించారు. దీనికి అధికారులు స్పందిస్తూ.. పహాణి, పాసుబుక్కు, ఆధార్‌కార్డు, నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకురావాలని, ఆ తరువాత రుణం పెంచేది చెంబుతామని అధికారులు రైతులను బుజ్జగించి పంపించారు. ఇదిలా ఉండగా.. రుణ విముక్తి పొందని వారు.. మాఫీ అయిందా లేదా అంటూ ఆరాతీస్తున్నారు.

అక్రమంగా పట్టా చేసుకున్నారు



తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

న్యాయం చేయండి సార్..

మోమిన్‌పేట: ‘మా భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారు. న్యాయం చేయండి’ సార్ అని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి రైతులు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల పరిధి దేవరంపల్లి గ్రామానికి చెందిన కర్రె రామయ్య వారసులు తహసీల్దార్ కార్యాలయంలో తమ గోడును వినవించారు. 1962లో గ్రామంలోని సర్వే నంబరు149లో 4ఎకరాల 6గుంటల వ్యవసాయ భూమిని రామయ్య రూ.400లకు జీపీఏ హోల్డరు ఫయాజునిస్సాబేగం నుంచి సాదా బైనమా కింద కొనుగోలు చేశారు. కానీ రిజిష్టర్ చేసుకోలేకపోయారు. నాటి నుంచి నేటి వరకు ఆయన వారసులు పంట పండించుకుంటూ జీవ నం కొనసాగిస్తున్నారు. 2016లో ఇతరులు తమ కు తెలియకుండానే మా భూమిని పట్టా చేయించుకున్నారని వాపోయారు. దయచేసి మా భూమి ని మాకు పట్టా చేయించాలని పేర్కొన్నారు.

‘మనబడి’ బిల్లులు చెల్లించండి

కలెక్టర్‌కు మాజీ చైర్మన్లు, నిర్వాహకుల వినతి



కలెక్టరేట్ ఆవరణలో నిర్వాహకులు తదితరులు

దోమ: రూ.లక్షలు వెచ్చించి మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాలేదని, త్వరితగతిన వచ్చేలా చూడాలని ఆయా పాఠశాలల మాజీ చైర్మన్లు, నిర్వాహకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. అభివృద్ధి పనులు చేసి రెండేళ్లు గడుస్తున్నా తమకు రావాల్సిన బిల్లులు రాలేదని వాపోయారు. బిల్లులను త్వరగా విడుదల చేయాలని పేర్కొన్నారు. ఇందులో శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి, బాలరాజ్, ఆంజనేయులు, కృష్ణ, సలీం, శేఖర్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

చిత్తడి రోడ్డు.. గిరిజనుల పాట్లు



తండారోడ్డు దుస్థితి

పరిగి: వర్షాకాలంలో తండావసులకు తిప్పలు తప్పడం లేదు. ద్విచక్ర వాహనం కాదుకదా.. కనీసం కాలినడకన సైతం రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మండల పరిధి మైసమ్మ చెరువు తండాకు వెళ్లాలంటే ఈ చిత్తడి రోడ్డే గిరిజనులకు దిక్కు. ఇదే సమస్యను ఎప్పటికప్పుడు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని తండా వాసులు ఆరోపిస్తున్నారు. చిన్న పాటి చినుకు పడితే తండాకు వెళ్లే మార్గం మొత్తం బురదమయం అవుతుందని, ఈ దారిగుండా ప్రయాణం చేయాలంటే కష్టంగా ఉందని వాపోతున్నారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

- బీసీ డిక్లరేషన్ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చండి
- 42 శాతానికి రిజర్వేషన్లు పెంచాలి
- బీజేపీ శ్రేణుల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన



కొడంగల్ రూరల్: తహసీల్దార్ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య గౌడ్, ఆ పార్టీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ ఆరోపించారు. బీసీలకు ఇచ్చిన మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీసీ గణన చేపట్టిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, అప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభించాలని, ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చాలని, గౌడ కులస్తులకు లైసెన్సుల మంజూరు చేయాలని కోరారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో బీసీ వసతిగృహాలు, గురుకులాల సంఖ్యను పెంచాలని కోరారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి జి.వెంకటయ్య, బీసీమోర్చా మండల అధ్యక్షుడు మహేశ్, నాయకులు కాటనిపల్లి అంజిలయ్య, జానకిరాం, భీమయ్య, శ్రీనివాస్, చెల్లాపూర్ ఆంజనేయులు, రామకృష్ణ, వెంకటేశ్, నరేష్, ధనుంజయ్, శేఖర్, శివ, కృష్ణ, రాంచంద్రయ్య ఉన్నారు.

చేప పిల్లల పంపిణీ ఏమైంది

కొడంగల్ రూరల్: బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా కొడంగల్ అధ్యక్షుడు దత్తాత్రేయ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బీసీ గణన చేపట్టి, కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారని, ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడు నెలలు గడుస్తున్నా.. ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ సబ్‌ప్లాన్‌కు తగినన్ని నిధులు కేటాయించి, ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మత్స్య సంఘాలకు చేప పిల్లలను పంపిణీ చేయలేదని, సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి ఎస్.రాకేష్, పార్టీ మండల అధ్యక్షుడు బందెప్ప, పట్టణ అధ్యక్షుడు సర్వేష్, మండల ప్రధాన కార్యదర్శి కరాటే శ్రీనివాస్ ఉన్నారు.

మాట నిలుపుకోని మంత్రి



తహసీల్దార్ సాజిదాబేగంకు వినతిపత్రం అందజేస్తున్న కమల నాథులు

ధారూరు: అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన చేసి, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచుతామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీ ఏమయిందని బీజేపీ శ్రేణులు ప్రశ్నించారు. మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులు బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శాంతుకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.రమేశ్, బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌లు మాట్లాడారు. 23 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామన్న మాట నిలబెట్టుకోలేక పోయారని ఆరోపించారు. బీసీ సబ్‌ప్లాన్‌కు తగిన నిధులు మంజూరు చేసి, తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టబద్ధమైన హోదా కల్పిస్తామని చెప్పి, కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. బీసీ యువతకు ర్యాంక్‌తో సంబంధం లేకుండా 6 నెలల్లో మొత్తం ఫీజురీయింబర్స్‌మెంట్ చేస్తామని హామీనిచ్చి, మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఇందులో పార్టీ నాయకులు బానుతేజ, గోపాల్, కృష్ణ, రాంచంద్రయ్య ఉన్నారు.